
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 3 ఆగస్టు 2024



'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉంది' అన్నట్టుగా ఉంది గ్రేటర్ వరంగల్ నగరం పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన నగరాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్మార్ట్‌సిటీ మిషన్ అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఆరంభశూరత్వంగా ప్రారంభించిన బల్దియా, కుడా అధికారులు.. ఆపై చేతులెత్తేయడంతో కొద్దిరోజులకే పనులు నిలిచిపోయాయి. చాలాచోట్ల స్మార్ట్ సిటీ మిషన్ అభివృద్ధి పనులు యేళ్ల తరబడి కొనసా..గుతూనే ఉన్నాయి. వరంగల్ నగరంలో 101 పనులకు 35 పనులు పూర్తి కాగా, ఇంకా 66 పనులు కొనసాగింపు దశలో ఉన్నాయి. ప్రధానంగా సెప్టెంబరు 9 వరకు ప్రారంభం కానున్న కాళోజీ కళాక్షేత్రం పనులు వర్షాల కారణంగా నిలిచిపోయాయి. ఇంకా కొన్ని ప్రారంభానికి కూడా నోచుకోలేదు.

ఆంధ్రజ్యోతి ఫోకస్

అదే నిర్లక్ష్యం

- వరంగల్ నగరంలో 101 పనులకు శ్రీకారం
- ఇంకా పూర్తికాని 66 అభివృద్ధి పనులు
- రూ.1000కోట్ల వర్కులకు బల్దియా ప్రతిపాదనలు
- బల్దియా, 'కుడా' శాఖల సమన్వయ లోపంతో వెనకంజ
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కొన్ని చోట్ల నిలిచిన వైనం
- వర్షం కారణంగా నిలిచిన మరికొన్ని పనులు

Smart City
MISSION TRANSFORM-NATION

నత్తనడకన సాగుతున్న స్మార్ట్ సిటీ పనులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 2: వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాలలో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టవలసిన పనులకు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) సంస్థల మధ్య సమన్వయలోపంతో పాటు పనులకు డబ్బుల కక్కుర్తి పడే అధికారుల వల్లే అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, మరికొన్నిచోట్ల నాసిరకం పనులతో తూతూమంత్రంగా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం పోటీపడుతున్నారు. పూర్తయిన పనులలో అటు కాంట్రాక్టర్లు, ఇటు బల్దియా, కుడా అధికారులు కుమ్మక్కై నామ మాత్రపు పనులు చేసి అందిన కాడికి దండుకున్నారే ప్రచారం జోరుగా సాగుతోంది. అంతేకాకుండా రెండు విభాగాల్లో చాలా కాలంగా పాతుకు పోయిన కొందరు అధికారులు.. బడా కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో పని చేస్తూ పర్సంటేజీలు ఇచ్చిన వారికే టెండరు లేకుండా పనులు అప్పగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

రూ.1000 కోట్ల పనులకు ప్రతిపాదనలు

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్‌లలో స్మార్ట్ సిటీ మిషన్ కింద అభివృద్ధి పనులు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకు ప్రభుత్వాలు ఒప్పుకుని పనులకు సంబంధించిన కొటేషన్ ఇవ్వాలని కోరింది. దీంతో బల్దియా పరిధిలో 89 రకాల పనులు చేసేందుకు కొటేషన్‌లను సిద్ధం చేసి పంపించారు. అందులో ఇప్పటివరకు 29పనులు పూర్తి కాగా, 53 పనులు పురోగతిలో ఉన్నాయని, ఇంకా మరో 7 రకాల పనులకు అగ్రిమెంట్లు చేసి టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలి పారు. అయితే ప్రధానంగా రూ.99కోట్లతో నగరంలో నిఘా కెమెరాల ఏర్పాటు (ఐసీసీసీ)కు, రూ.250 కోట్లతో ఉర్సుగుట్ట, ప్రగతినగర్, రెడ్డిపురంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం, రూ.12కోట్లతో నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం, రూ.76కోట్లలో భద్రకాళి బండ్ నిర్మాణంలో అభివృద్ధి పనులు, రూ.34కోట్లతో వడ్డెపల్లి బండ్, రూ.30కోట్లతో రాంపూర్‌లో బయో మైనింగ్ ప్లాంట్ ఏర్పాటు పనులు, రూ.9కోట్లతో పబ్లిక్‌గా డ్రైన్ డెవలప్‌మెంట్, రూ.2కోట్లతో పోతన నగర్‌లో దోబీ ఘాట్ నిర్మాణాల పనులు ఇంకా కొనసాగు తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ పనులు 60 నుంచి 70 శాతం పూర్తయ్యాయని, ఇంకా మరో మూడు మాసాల్లో పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు బల్దియా స్మార్ట్‌సిటి నిధులతో రూ.529కోట్ల పనులు పూర్తి చేశారని, మరో రూ.300కోట్ల పనులు కొనసాగుతున్నాయని, మిగతా రూ.171 కోట్లతో రోడ్లు, లైటింగ్, గ్రీనరీకి ఉపయోగిస్తామంటున్నారు.

కుంటుపడుతున్న కుడా పనులు

వరంగల్ నగరాన్ని సుందరీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడబ్ల్యుఎంసీతో పాటు కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థకు కూడా ప్రత్యేక నిధులను విడుదల చేస్తోంది. ఈ క్రమంలో యేటా వంద నుంచి 200కోట్ల రూపాయల వ్యయంతో కూడిన పనులు చేస్తున్నట్టు అధికారులు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం కుడా పరిధిలో 12 రకాల పనులకుగాను ఆరు పూర్తి కాగా, మరో ఆరు పురోగతిలో ఉన్నాయి. అయితే కుడా చేస్తున్న పనులలో జాప్యం జరుగుతోందని, ఇటీవల కురిసిన వర్షాలతో అభివృద్ధి పనులకు గ్రహణం పట్టిందనే విమర్శలున్నాయి. కుడా అధికారులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని పనులు పూర్తి చేసినా.. చేయాల్సిన మేజర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.50కోట్లతో

మిగతా 8వ పేజీలో..





స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.70వేలు డిమాండ్

ఏసీబీకి చిక్కిన ఎస్సై

- రూ.20 వేలు ప్రైవేటు వ్యక్తి ద్వారా ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్
- రూ.40వేలు నేరుగా తీసుకుంటూ దొరికిన వెంకన్న


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ



పట్టుబడిన డ్రైవర్, ఎస్సై

పర్వతగిరి, ఆగస్టు2: కేసు నుంచి తప్పిం చేందుకు నిందితుల లంచం తీసుకుంటూ పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం. పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ మీదుగా గత నెల 27 రాత్రి ట్రాలీ ఆటోలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా, ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి బాదావత్ భాస్కర్, డ్రైవర్ రాజేష్, వర్కర్ రవిపై కేసు నమోదు చేశారు. అయితే వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపకుండా, 35 క్లాజ్ (బీ) బీఎన్ఎస్ యాక్ట్ కింద నోటీసులు ఇవ్వకుండా వారిని పోలీస్‌స్టేషన్ చుట్టూ తి ప్పించుకున్నాడు. ఈ క్రమంలో అజ్మీరా వెంకట్ అనే వ్యక్తి ద్వారా విషయం గు రించి బాధితులు ఆరా తీయగా రూ.70వేలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తానని, లేకపోతే జైలుకు పంపిస్తానని ఎస్సై చెప్పాడు. తమ వద్ద ప్రస్తుతం అంత డబ్బులు లేదని చెప్పడంతో రూ.20 వేలను ఎస్సై ఓ ప్రైవేటు వ్యక్తికి ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మిగతా రూ.50వేలు ఇస్తేనే నోటీసులు ఇస్తానని, లేకపోతే జైలుకు పంపిస్తానని హెచ్చరించాడు. దీంతో బాధితుడు బాదావత్ భాస్కర్ ఏసీబీ కార్యాలయంలో అధికారులను సంప్రదించాడు.

దీంతో శుక్రవారం అధికారులు పథకం ప్రకారం రూ.40వేలు ఇస్తామని నిం దితుడు భాస్కర్ ద్వారా ఎస్సైకి ఫోన్ చేయగా, ఆయన తన డ్రైవర్ సదానం దంకు ఇవ్వాలని సూచించాడు. ఎస్సై చెప్పినట్టు డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వగా అతడు వాటిని తీసుకుని ఎస్ఐ ఆఫీసుకు వెళ్లగా, ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అనంతరం డ్రైవర్ సదానంతోపాటు, ఎస్సై వెంకన్నను అ దుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజ రుపర్చనున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. ఉద్యోగులు, సిబ్బంది లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

చిచ్చుపెట్టిన స్థల వివాదం

- ఇంటిస్థలం డబ్బులివ్వలేదని అన్న గొంతు కోసిన తమ్ముడు
- మద్యం మత్తులో బ్లేడుతో దాడి
- వరంగల్ రంగశాయిపేటలో ఘటన


దాడి చేసిన రాజేష్‌ఖన్నా


గాయపడిన రాజు

శంభునిపేట, ఆగస్టు 2:ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వాలని ఓ వ్యక్తి తన అన్న గొంతుకోసిన ఘటన శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. రంగశాయిపేటకు చెందిన రావుల వీరయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరయ్య దంపతులు గతంలోనే మృతిచెందారు. పెద్దకుమారుడు రావుల రాజు (52) రంగశాయిపేటలో మటన్ షాపు నడుపుతున్నాడు. చిన్నకుమారుడు రాజేష్‌ఖన్నా(దివ్యాంగుడు) హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. తోబుట్టువులు అందరికీ వివాహాలు కావడంతో అన్నదమ్ములు తండ్రికి చెందిన ఇంటి స్థలాన్ని ఇటీవల పంచుకున్నారు. వీటికి సంబంధించి రాజు తన తమ్ముడు రాజేష్‌ఖన్నాకు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయంలో ఇద్దరి మధ్య తగాదా నడుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం రాజు గవిచర్ల క్రాస్ రోడ్ జంక్షన్ వద్ద గల తన షాపు బంద్ చేసుకొని సైకిల్‌పై ఇంటికి బయలుదేరే సమయంలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన రాజేష్‌ఖన్నా స్థలం విషయంలో అన్నతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగ్గా.. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజేష్‌ఖన్నా కోపంతో ఊగిపోయాడు. తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో అన్న గొంతు కోశాడు. గొంతుకు గాయమై రక్తస్రావం కావడంతో రాజు అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. స్థానికుల ద్వారా విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న రాజు కుమారుడు సోమేశ్వర్ స్థానికులతో కలిసి ఎంజీఎంకు చికిత్స నిమిత్తం తరలించాడు.

అయితే గొంతు కోసి పారిపోయేందుకు యత్నించిన రాజేష్‌ఖన్నాను స్థానికులు పట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడు రాజేష్‌ఖన్నాను అదుపులోకి తీసుకుని, హత్యాయత్నానికి ఉపయోగించిన బ్లేడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్టు కుమారుడు సోమేశ్వర్ తెలిపారు. రాజు కుమారుడు సోమేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజేష్‌ఖన్నాకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

సీకేఎం ఆస్పత్రి ఆర్‌ఎంవో బదిలీ



బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే స్థానచలనం

గిర్మాజీపేట, ఆగస్టు 2 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ యాకుబ్ పాషా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. గత 17న జరిగిన సాధారణ బదిలీలో హసన్‌పర్తి మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తు హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న యాకుబ్ పాషను సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంవోగా నియమించారు. ఈయన బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే బదిలీ చేస్తూ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవిందర్ నాయక్ ఈనెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు యాకుబ్ పాషా గత నెల 30న సీకేఎం ఆస్పత్రి నుంచి రిలీవ్ అయ్యారు. అయితే ఫోకల్ స్థానం(హసన్‌పర్తి)లో పనిచేస్తున్న యాకుబ్ పాషాను తిరిగి ఫోకల్ స్థానం(సీకేఎం ఆస్పత్రి)కు బదిలీ చేయడం సాధారణ బదిలీల జీవో 80లోని 6వ పేరాలోని డి (ఫోకల్ నుంచి నాన్ ఫోకల్ ట్రాన్స్‌ఫర్ చేయాలి) ప్రకారం లేనందున గతంలో ఇచ్చిన సీకేఎం ఆస్పత్రి పోస్టుకు బదులుగా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి బదిలీ చేస్తున్నట్లు తాజా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యాకుబ్ పాషా స్థానంలో సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆర్‌ఎంవోగా ఇంకా ఎవరినీ నియమించ లేదు.


వరుణ్ (ఫైల్)

స్కూల్ బస్సు దిగుతూ..

- టైరు కిందపడి ఏడేళ్ల బాలుడి మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే ఆందోళన

7

'స్వచ్ఛదనం- పచ్చదనం'ను సక్సెస్ చేయాలి

అధికారులు సమన్వయంతో సాగాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవా రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో రోజువారీగా చేపట్టా ల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమం నిర్వ హణ పటిష్టంగా జరిగేందుకు మండలస్థాయిలో జిల్లా పరి షత్ సీఈవో, డీఆర్‌డీవో, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అందరిని భాగస్వాములు చేయాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతిగృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్‌లలో పారిశుద్ధ్య పనులతోపాటు ప్రతీ శుక్ర వారం డ్రై డేగా పాటిస్తూ మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వచ్ఛదనం, పచ్చదనంపై విద్యార్థులకు వ్యాసరచన, పద్యగేయాల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేసి ప్రోత్సాహించాలని డీఈ వోను కలెక్టర్ ఆదేశించారు.

మొక్కలు నాటాలి..

వన మహోత్సవం కింద గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, పట్టణాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ నిమిత్తం అనువైన స్థలాలను గుర్తించి, ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటేలా ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆఫీసర్లు

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (హైదరాబాద్)లో శిక్షణ పొందుతున్న అధికారులు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణ పొందుతున్న సుమారు 20మంది జూలై 29 నుంచి ఈనెల 2న వరకు గీసుగొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం, వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, సంగెం మండలంలోని తీగరాజుపల్లి గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి పాల్గొన్నారు.


బస్సులకు పచ్చజెండా ఊపుతున్న కలెక్టర్

హైదరాబాద్ తరలిన ఉద్యోగులు

రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు జిల్లాలోని ఉపాధ్యాయులు తరలివెళ్లారు. శుక్రవారం కలెక్టర్ ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదోన్నతి పొందిన సుమారు 634 మంది ఉపాధ్యాయులు సీఎం సభకు వెళ్లి, తిరిగి సురక్షితంగా చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిం దన్నారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

స్కూటీతో ఢీకొట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన తండ్రి సిలువేరు వీరస్వామిని స్కూటీ అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టిన ఎం.భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని సిలువేరు పున్నం శుక్రవారం హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీపని చేసే తన తండ్రి గత నెల 24న గ్రామంలో ఒకరి ఇంటివద్ద పని చేస్తుండగా వేగంగా వచ్చిన భరత్ ఢీకొట్టడంతో కాలుకు తీవ్ర గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, తీవ్ర గాయం కావడంతో కాలు తొలగించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. తన తండ్రిని ఢీకొట్టిన భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని పున్నం కోరారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఓఆర్‌ఆర్‌పై పెట్రోలింగ్ చేస్తుండగా టోల్ ప్లాజా వద్ద ముగ్గురు యువకులు కారులో గంజాయి సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించారు. పి.కృష్ణారెడ్డి, సాయిపవన్, పి.అరవింద్ అనే ముగ్గురు యువకులను అరెస్టు చేసి కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవిందర్ ధ్రువీకరించారు.

● ఐనవోలు : ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొండపర్తి గ్రామానికి చెందిన బుంగ కల్యాణ్ ఆటోలో వచ్చి పోలీసులను చూసి పరిగెత్తే ప్రయత్నం చేశాడు. ఆటోను తనిఖీ చేయగా ఒక ప్లాస్టిక్ కవర్‌లో 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.2,500 వరకు ఉంటుంది. ఆటోతోపాటు సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



హనుమకొండలోని ఓఆర్‌ఆర్‌పై పట్టుబడిన ముగ్గురు యువకులు

అమెరికా రోడ్డు ప్రమాదంలో గుండ్రాతిమడుగువాసి మృతి

▸ స్వగ్రామంలో రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి


రోహిత్‌రెడ్డి (ఫైల్)

కురవి, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన బండి రోహిత్‌రెడ్డి(27) అమెరికాలోని టెక్సాస్‌లో జూలై 24న మృతి చెందాడు. ఏప్రిల్ 27న టెక్సాస్‌లో తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రోహిత్‌రెడ్డి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం విమానంలో హైదరాబాద్‌కు తీసుకురాగా, స్వగ్రామమైన గుండ్రాతిమడుగుకు మధ్యాహ్నం తీసుకువచ్చారు. రెండు గంటలకు రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డి దంపతులకు రోహిత్‌రెడ్డి, రోహన్‌రెడ్డి కుమారులు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి కాగా, అవివాహితుడు. ఇద్దరు అన్నదమ్ములు ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. అంత్యక్రియల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, భరద్వాజ్ రెడ్డి, బండి అజయ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన భర్త, అత్త కనిపించడం లేదని హసన్‌పర్తికి చెందిన పి.సాయిశివాని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 17న తనతో భర్త మణిదీప్, అత్త గొడవపడి పుట్టింటికి వెళ్లగొట్టినట్లు తెలిపారు. తిరిగి తల్లిదండ్రులతో 22వ తేదీన రాగా, భర్త, అత్త ఇంట్లో లేరని, ఇంటికి తాళం వేసి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్‌లో ఉన్నాయని, బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు తిరిగినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

తాండేమా బోరాయి తీజ్

▸ ప్రకృతి పరవశించే సంప్రదాయ ఉత్సవం
▸ నేటి నుంచి 11 వరకు వేడుకలు
▸ తొమ్మిది రోజులు తండాల్లో సందడే సందడి
▸ ఆటపాటలతో గిరిజనుల్లో జోష్
▸ ఒకేసారి నిర్వహించుకోవాలని గిరిజనుల యోచన
▸ తీజ్ పండుగకు గుర్తింపు ఇవ్వాలని బంజారాల డిమాండ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: గోర్ బంజారాలు సంస్కృతి, సంప్రదాయబద్ధంగా.. ప్రకృతి పరవశించే విధంగా ఏడుగురు కుల దేవతల్లో ఒకరైన మేరామాయాడిని స్మరిస్తూ మేరమా మాత అనుగ్రహంతో జన్మించిన సేవాలాల్ మహారాజ్‌ను మనసారా కొలిచి వేడుకలు నిర్వహిస్తారు. పాడిపంటలు, పిల్లపాప, పశువులు చల్లాగా ఉండేలా దీవించాలని లంబాడ గిరిజనులు భక్తిశ్రద్ధల నడుమ గోధుమ నారుపోసి, గడ్డి బతుకమ్మతో తీజ్ పండుగను జరుపుకుంటారు. ఏటా శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు వారి వెసులుబాటును బట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. పూర్వకాలంలో నిరక్షరాస్యులైన గిరిజనులు వ్యవసాయ సీజన్‌ను అంచనా వేయడానికి వర్షాకాల ఆరంభం అనంతరం వరినాట్లు పూర్తిచేసుకొని తీరిక సమయాల్లో తీజ్ పండుగకు సన్నద్ధమవుతారు. ఈ ఆచార సంప్రదాయ పండుగలు నేటికి కొనసాగుతూ వస్తున్నాయి. ఇక ఈ ఏడాది శనివారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలు 11 వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. ఒకేసారి ఈపండుగను నిర్వహించుకోవాలని గిరిజనులు యోచిస్తున్నారు. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనులు కోరుతున్నారు.

తీజ్ నేపథ్యం ఇదీ..

గోర్ బంజారాలు శ్రీసేవాలాల్ మహారాజ్, దండి మేరామ మాతను దైవ దూతలుగా కొలుస్తారు. తండాల్లోని పెళ్లి కాని అమ్మాయిలు తమ తల్లిదండ్రులకు పంటలు బాగా పండాలని, అభివృద్ధి చెందాలని భావిజీవితం సవ్యంగ కొనసాగాలని భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమానురాగాలు మరింతగా బలపడాలని పార్వతీదేవి శివునిప్రేమ పొందడానికి 107 జన్మలెత్తి 108వ జన్మలో శివున్ని భర్తగా పొందిన రోజు గుర్తుగా ఈ తీజ్ పండుగను నిర్వహిస్తారని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ దేవతను కొలుస్తూ కన్నెలు ఎన్నోవిధాలుగా అభ్యరిస్తూ శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను నిర్వహిస్తారు. ఉత్తర భారతదేశంలో తీజ్ పండుగను పెళ్లయిన మహిళలు నిర్వహిస్తారు. తమ భర్తల నుంచి ప్రేమానురాగాలు పొందడానికి ఈ పండుగను జరుపుకోవడం విశేషం.


గుండ్లబోడు తండాలో తీజ్ బుట్టపై నీరు పోస్తున్న బాలిక (ఫైల్)

తొమ్మిదో రోజు ఇలా..

తొమ్మిదో రోజును బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ తీజ్ ఘనంగా నిర్వహించుకుంటారు. తీజ్ నిమజ్జనానికి బంధు, మిత్రులందరినీ ఆహ్వానిస్తారు. అత్యంత పవిత్రంగా మేరామ మాతను, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తారు. డప్పు చప్పుళ్లతో గిరిజన సంస్కృతి సంప్రదాయం ప్రకారం పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ తొమ్మిదో రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఆడపిల్లలు పెంచిన తీజ్‌ను తండానాయక్ పరిశీలించి ఒక్కొక్క బుట్టను ఆడ పిల్లలకు అందజేస్తారు. తమను ఆపదల నుంచి రక్షించాలని అన్నాదమ్ములకు నారు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఈ గోధుమ నారు అత్యంత పవిత్రమైందని. దీనివల్ల శుభం జరుగుతుందని నమ్మకం. తీజ్ బుట్టలను పట్టుకుని వరసగా నిమజ్జనానికి డప్పుచప్పుల్లతో బయలుదేరుతారు. ఆటా..పాటలు కేరింతలతో ఆనంద భరితంగా ఈ నిమజ్జన వేడుక కొనసాగుతుంది. చెరువు దగ్గర ఈ తీజ్ నిమజ్జనం ఓ అద్భుతమైన సన్నివేశం జరుగుతుంది. తీజ్ తమను వదలివెళ్లి పోతుందనే దుఃఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఊరడిస్తుంటారు. జీవితాంతం నీకు తోడుగా ఉంటూ రక్షిస్తానని చెల్లెల్ని పీటపై నిల్చోపెట్టి కాళ్లను కడిగి సోదరుడు పాదాభివందనం చేస్తాడు. ఆ తర్వాత చెరువులో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు.


తీజ్ బుట్టలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

ఈ ఏడాది తీజ్ పండుగ వివరాలు..

లంబాడ గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధల నడుమ జరుపుకునే తీజ్ పండుగను ఒకేసారి జరుపుకోవాలని గిరిజన పెద్దలు తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలు నిర్వహించుకొని గిరిజనులు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలి రోజు శనివారం గోధుమలు నానబెట్టడం, ఆదివారం తీజ్ బుట్టలో వేయుట, 5న సోమవారం బోరడి తీజ్, 9న డమోలీ తీజ్, 10న ఘనగోర్ తీజ్, చివరి రోజు 11న నిమజ్జనం చేసేందుకు తేదీలను ప్రకటించారు. వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఆయా తేదీల్లో తీజ్ పండుగను జరుపుకోవాలని సూచించారు.


మహబూబాబాద్ శివారు తండాలో తీజ్ బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మహబూబాబాద్



గోర్ బంజార సంస్కృతి కూడా భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమే. భారతీయ సంస్కృతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగురాష్ట్రాల్లో లంబాడీ గిరిజనులు మాత్రమే నిర్వహించుకునే తీజ్ పండుగను శనివారం నుంచి 11 వరకు ఒకే కాలంలో నిర్వహించుకొని జాతీ ఐక్యతను చాటుకోవాలి. ప్రభుత్వాలు కూడా 9 రోజులు నిర్వహించే తీజ్ పండుగలో పవిత్రరోజైన డమోళీ తీజ్ (7వ రోజు శుక్రవారం) సెలవు ప్రకటిస్తే చివరి మూడురోజులు (డమోళీ తీజ్, గణగోర్ తీజ్, కడావ్ తీజ్) ఘనంగా నిర్వహించి తీజ్ పండుగ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించడానికి వీలుంటుంది.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

గుగులోతు కిషన్‌నాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు మానుకోట



లంబాడ గిరిజనులు ఏటా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సంప్రదాయం, భక్తిభావం, క్రమశిక్షణతో పాటు అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. నిజజీవితంలో ఆడపిల్లలకు కష్టాలు ఎదురైనప్పుడు నీ కష్టాల్లో తోడుగా నేనున్నాని(అన్న) భరోసా, మనోధైర్యం కల్పించే పండుగ తీజ్. ప్రతి ఏటా తీజ్ నిమజ్జనం రోజు చెరువు దగ్గర చెల్లెలిని పీటపై నిల్చోబెట్టి సోదరులు కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తారు. ఈ బంధం కలకాలం ఇలాగే ఉండాలని సోదరులను చెల్లెళ్లు ఆశీర్వదించడం ఆనవాయితీగావస్తోంది.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాజీపేట, ఆగస్టు 2: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు 30 - 35 సంవత్సరాలలోపు ఉంటుంది. ఎత్తు 5.7 చామన ఛాయ రంగు, నలుపు రంగు ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ నంబర్ 87126 58609 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


రాజు మృతదేహం

భీమదేవరపల్లి, ఆగస్టు 2: భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కథనం ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన దండెం రాజు(27) సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామానికి చెందిన రవళితో 8 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లున్నారు. భార్యభర్తల మధ్య తరుచూగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 25న భర్తతో గొడవ పడి రవళి తన పుట్టింటికి వెళ్లింది. రాజు అప్పటి నుంచి తన భార్యను తన ఇంటికి రావాల్సిందిగా పలుమార్లు ఫోన్లు చేశాడు. కానీ రవళి తన పుట్టింటి వద్దనే ఉంటుంది. పిల్లలని చూడాలని ఉందని, కోరినా రవళి స్పందించలేదు. దీంతో నిరాశకు గురైన భర్త రాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

కెమిస్ట్రీలో బానోతు రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బానోతు రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఏపీలోని మచిలీపట్నంలోని కృష్ణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ కణాల నిర్మూలకు చేసిన విలువైన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. 'సింథసిస్ ఆఫ్ టెట్రాజోన్ ఫ్యూజ్డ్ ఇమీడాజో ఫిరడిన్స్ అనే అంశంపై కృష్ణ వర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి, రెక్టార్ ఎంవీ భసవేశ్వరరావు పర్యవేక్షణలో బానోతు రెడ్డి పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన బానోతు రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొలగాని రాములు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ముగ్గురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

▸ ఒకరికి విషపురుగు కుట్టినట్లు నిర్ధారణ
▸ మరో విద్యార్థి పరిస్థితి విషమం
▸ బండారుపల్లి తెలంగాణ గురుకులంలో ఘటన


బండారుపల్లిలోని తెలంగాణ బాలుర గురుకులం

ములుగు, ఆగస్టు 2: 12గంటల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లి తెలంగాణ బాలుర గురుకులంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. గురువారంరాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ కాళ్లు తిమ్మిరెక్కడంతో ఇబ్బంది పడ్డాడు. ఉపాధ్యాయులు వెంటనే బాలున్ని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స తర్వాత ఎంజీఎంకు తీసుకువెళ్లారు. విషపురుగు కుట్టినట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇదేక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండ జిల్లా ఆరెపల్లి వద్దగల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రణయ్ కోలుకున్నాడు. ఉదయం8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన అతన్ని ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తోటి విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. కాగా, గురుకులంలో చదువుతున్న తమ పిల్లలు ఎలా ఉన్నారోనని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్‌లు చేసి వాకబు చేశారు.

5న గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని యాకుబ్‌పుర గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీన తక్షణ(స్పాట్) ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ జి.రామ్మోహన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ-15, బీపీసీ 21, 5 తరగతిలో 6, అలాగే 9వ తరగతిలో 8 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల గిరిజన బాలురు ఉదయం 10గంటలకు వరంగల్‌లోని యాకూబ్‌పుర గిరిజనబాలుర గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9490957296 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

బాలికల పాఠశాలలో..

హనుమకొండ దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల ఖాళీల భర్తీకి ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కోరే జ్యోత్స్న తెలిపారు. 5వ తరగతిలో 3 (ఎస్టీ కేటగిరి), ఎంపీసీ మొదటి సంవత్సరంలో 4 సీట్లు (ఎస్టీ కేటగిరి) ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు, ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తారు. వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని రావాలని అన్నారు. వివరాలకు 8919948321 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

8వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారు, సెమీస్కిల్డ్ కార్మికులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అబ్రాడ్, జర్మనీ, జపాన్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8125251408, 9100798204లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

స్కూల్ బస్సు దిగబోతూ..

▸ టైరు కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి
▸ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

జనగామ కల్చరల్, ఆగస్టు 2: స్కూలు బస్సు దిగబోతూ వెనక టైరు కింద పడి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇందుకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. వివరాల్లోకి వెళితే.. జనగామ మండలం అడవి కేశ్వాపురం గ్రామానికి చెందిన బానోతు గణేష్-మంజుల దంపతుల కుమారుడు వరుణ్(7) జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం యథావిధిగా స్కూలుకు వెళ్లి ఇంటికి వస్తూ బస్సు దిగుతుండగా పుస్తకాల బ్యాగు డోర్‌కు తట్టుకొని వెనుక టైరు కింద పడిపోయాడు. డ్రైవర్ మహేందర్ చూసుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో వెనక టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకున్న కొడుకు కళ్లెదుటే విగత జీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బస్సు అద్దాలు ధ్వంసం..

ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. విద్యార్థి బస్సు దిగకుండానే డ్రైవర్ బస్సు నడపడంతో బాలుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రఘుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, పరిశీలిస్తున్న సీఐ

పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

▸ 125 క్వింటాళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఆగస్టు 2: జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సౌరారం గ్రామంలోని రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన రూ.3లక్షల 12వేల విలువ కలిగిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిసర గ్రామాల్లో సేకరించిన పీడీఎస్ రైస్‌ను డి.రమేశ్ అనే వ్యక్తి రైస్‌మిల్‌లో నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శరత్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. రైస్‌ను స్వాధీనం చేసుకుని రమేశ్‌ను అదుపులోకితీసుకుని విచారణనిమిత్తం జఫర్‌గడ్ పోలీసులకు అప్పగించారు.

కోత యంత్రం తగిలి వ్యక్తి మృతి

▸ చెట్టు కొమ్మల/ కోస్తుండగా ప్రమాదం

చిట్యాల, ఆగస్టు 2: కోత యంత్రం సహాయంతో చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశత్తు వ్యక్తికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాలపరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాదువెల్లి పైడయ్య(55) సొంతంగా కోత యంత్రం కొనుగోలు చేసి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లు కోసేందుకు కూలీకి వెళ్తుంటాడు. కాగా గ్రామంలోని ఓవ్యక్తి ఇంటి వద్ద చెట్టు కొమ్మను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం పైడయ్య ఛాతికి తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నాడు.

అగ్నిమాపక శాఖలో జిల్లాలకు ఫైర్‌మన్‌ల కేటాయింపు

మట్టెవాడ, ఆగస్టు 2: అగ్నిమాపక శాఖలో కొత్తగా చేరి హైదరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ శిక్షణ కేంద్రంలో నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్‌లకు వివిధ జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 51 మంది ఫైర్‌మెన్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి వివిధ జిల్లాల్లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీసీ పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ జిల్లాకు 18 మంది, హనుమకొండ జిల్లాకు 10 మంది, జనగామ జిల్లాకు 10, మహబూబాబాద్ జిల్లాకు ఇద్దరు, ములుగు జిల్లాకు ఆరుగురు, భూపాలపల్లి జిల్లాకు 5 మంది ఫైర్‌మెన్‌లను కేటాయించారు.

ఉపాధ్యాయుడికి వెంకయ్యనాయుడి ప్రశంస

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2: హనుమకొండ బ్రాహ్మణవాడలో నివాసముంటున్న హనుమాండ్ల జనార్దన్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. రెండు రోజుల క్రితం దుగ్గొండి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి హిందీ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఉపాధ్యాయ దంపతులను పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కలిసి ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించడం, అడుగడుగునా వారిపై పూలవర్షం కురిపించడం ఆ గురువు పట్ల అద్భుతభక్తి ప్రదర్శించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది ఏకంగా వెంకయ్య నాయుడు దృష్టికి కూడా పోయింది. ఈ క్రమంలో ఆయన తన ట్విట్టర్‌లో ఆ ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది.

మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతరం

▸ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2: మొదటి దశగా కార్పొరేషన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లను మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతం చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, నోడల్ ఆఫీసర్లతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకరావాలన్నారు. షెడ్యూల్ మెయింటెనెన్స్ అంత యాప్‌లో పొందపర్చాలన్నారు. కార్పొరేషన్ సబ్‌స్టేషన్ల తర్వాత మున్సిపాలిటీల్లో మానవరహిత సబ్‌స్టేషన్లను సిద్ధం చేస్తామన్నారు. ఫీడర్లకు ప్రత్యామ్నాయసరఫరా, రింగ్‌మైన్‌ల ఏర్పాటు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి కంకణబద్ధులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.



రాజేందర్‌కు బీజేపీ కుండువా కప్పుతున్న శ్రీధర్

సొంత గూటికి పుప్పాల రాజేందర్

ఖిలావరంగల్, ఆగస్టు 2: సీనియర్ నాయకుడు పుప్పాల రాజేందర్ సొంత గూటికి చేరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర బొగ్గుగనుల వనరుల శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ చేతుల మీదుగా బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఏడు నెలలు తిరుగక ముందే మళ్లీ కమలం కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిలుకర వీరస్వామి పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న 'జంగా'



అమ్మవారిని దర్శించుకున్న జంగా రాఘవరెడ్డి దంపతులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 2: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు శుక్రవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న రాఘవరెడ్డి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వల్లభ గణపతిని దర్శించుకొని భద్రకాళి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు. పండితులు ఆశీర్వచనం చేశారు. అలాగే, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళకు చెందిన యోగా గురువు రాకాడి భద్రకాళి అమ్మవారిని దర్శించున్నారు.

'కొండా'ను కలిసిన కరాటే ప్రభాకర్



ఖిలావరంగల్, ఆగస్టు 2: ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ మర్యాద పూర్వకంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును కలిశారు. శుక్రవారం హనుమకొండలోని రాంనగర్‌లోని ఆయన నివాసంలో కొండాను కలిసి బొకేను అందజేశారు. ప్రభాకర్‌కు కొండా సత్కరించి, స్వీట్లను తినిపించారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణ

శంభునిపేట, ఆగస్టు 2 : వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణ అని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేదవి అన్నారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు శుక్రవారం రంగశాయిపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో పరిధిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో యూపీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వేదవి మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులబారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సీఏ ఎలుగు సుజాత, ఏఎన్ఎమ్ శ్రీలత, ఎమ్ఎస్ఓ రజిత, కుసుమ పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం'ను విజయవంతం చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 2: 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం.. కార్యక్రమం ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందుకుగాను గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లకుగాను 66 మంది అధికారులకు కేటాయిస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు, ఆర్పీలను సమన్వయం చేసుకుని ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలను దిగ్విజయం చేయాలన్నారు. ప్రతీ రోజు ఒక ప్రాంతం చొప్పున ఎంచుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని, ఐదు రోజుల పాటు సిబ్బందికి ఎలాంటి సెలవులు ఉండవన్నారు. 5వ తేదీన ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించి యూత్, మెప్మా, ఆర్పీలు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రత, సీజన్‌వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. 6న ఇంకుడు గుంతలు, భూగర్భజలాల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. 7న రోడ్లపై ఏర్పడిన గుంతలు, శిథిల భవనాలపై అవగాహన కల్పించాలన్నారు. 8న కుక్కకాటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చివరి రోజైన 9న ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాలు శుభ్రం చేయడంపై డ్రైడేను పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సిటీ ప్లానర్ శైలజ, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్‌తోపాటు 66 డివిజన్‌ల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

కమిషనర్‌ను కలిసిన పన్నుల విభాగం అధికారి శ్రీనివాస్

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో కార్పొరేషన్‌కు పన్నుల విభాగం అధికారిగా బిర్రు శ్రీనివాస్‌ను బదిలీ చేశారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. బాలసముద్రంలోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో పని చేసి బల్దియాకు గుర్తింపు తీసుకురావాలని కమిషనర్ సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

ప్రభుత్వ ఆరోగ్యశాఖ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చోంగ్తా

వరంగల్ కార్పొరేషన్, జూలై 2: వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆరోగ్యశాఖ సెక్రెటరీ క్రిస్టినా జడ్‌చోంగ్తా అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కార్యాలయం నుంచి సీడీఎంఏ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బల్దియా కార్యాలయం నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ సెక్రెటరీ సూచనలకు బల్దియా కమిషనర్ వివరణ ఇచ్చారు. దోమలు ప్రబలకుండా ముందస్తుగా 66 డివిజన్‌లలో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. పారిశుధ్య, మలేరియా సిబ్బందికి ఫెస్టిసైడ్ ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. దీర్ఘకాలం నిలువ ఉండే నీటిలో గంబూషియా చేపలను వదులుతున్నామన్నారు. డెంగీ తరహా కేసులు నమోదైతే చుట్టుపక్కల 50 ఇళ్లవరకు దోమల నివారణ కోసం చర్యలు చేపడుతామన్నారు. ఇందుకోసం 200 మంది మలేరియా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఇప్పటివరకే 150 పాఠశాలలో దోమల నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 36 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, పరకాల మున్సిపల్ కమిషనర్ నర్సింహ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 2: నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.16 .50లక్షల విలువైన చెక్కులను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం అందించారు. హనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రామన్నపేటకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, 29వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణచందర్, పూర్ణ, సోషల్ మీడియా అధ్యక్షుడు సౌరం బాలకృష్ణ, మహిళా అధ్యక్షురాలు కొలిపాక పద్మ, ఎస్సీ సెల్ నాయకులు బుర్ర శ్రావణి, రఫీ పాల్గొన్నారు.

8న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారు, సెమీస్కిల్డ్ కార్మికులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి సీహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 81252 51408, 91007 98204లలో సంప్రదించవచ్చని సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు



లేబర్‌కాలనీలో స్వీట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఖిలావరంగల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం తీర్పును స్వాగతిస్తూ లేబర్‌కాలనీలో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవిందర్ స్వీట్లను పంపిణీ చేశారు. 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బరిగెల సుధాకర్, దేవేందర్‌రాజుల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రవీందర్ మాట్లాడుతూ 1996లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసి, అసెంబ్లీ బిల్లు పాస్ చేసి పార్లమెంట్‌కు పంపించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం దళిత పార్టీ నాయకులు దేవేందర్‌రాజు, శిరబోయిన రాజు, బజ్జూరి వీరేశం, పొలేపాక సాయి, కంద్రాతి రాజు పాల్గొన్నారు.

● గీసుగొండ: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు నేపథ్యంలో గీసుకొండ, ధర్మారం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. పరకాల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల దళితుల పోరాటం ఫలించిందన్నారు. కార్యక్రమంలో చాడ కొమురారెడ్డితో పాటు నాయకులు రాజ్‌కుమార్, భీమగాని సౌజన్య, శ్రీను, దౌడు ప్రవీణ్‌కుమార్, దూల వెంకన్న, కూసం రమేష్, దౌడు బాబు, దౌడు భరత్, సంపత్, సురేష్, వేణు, సునీల్, కందికొండ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. అలాగే ధర్మారంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, దుపాకి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీ, డీడీలకు చాంబర్ ప్రతినిధుల సత్కారం



ఆర్‌జేడీ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 2: వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతుల చేపట్టిన ఉప్పుల శ్రీనివాస్‌ను శుక్రవారం వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డైరెక్టర్ వి.పద్మావతిని, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, చాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గద్దర్, జహీర్‌ఖాన్‌ల యాది సభ పోస్టర్ ఆవిష్కరణ



ఖిలావరంగల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 2: ప్రజాయుద్ధనౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీర్‌ఖాన్‌ల యాది సభను 6న జయప్రదం చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం ఖిలావరంగల్ అంబేద్కర్ విగ్రహం వద్ద కవి, గాయకుడు బొడ్డు కుమారస్వామి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ 6న క్రిస్టియన్‌కాలనీలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులు గద్దర్, జహీర్‌ఖాన్‌ల వర్ధంతి సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పూలే సామాజిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్, సామాజికవేత్త నలిగంటి విజయపాల్, బార్ కౌన్సిల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్, కళాకారులు సూదమల్ల అశోక్, కందిక సుధాకర్, బెల్లంకొండ రమేష్, పాలకుర్తి సత్యం, ముప్ప కట్టమల్లు, గద్దల సంజీవ, గడ్డం సుధాకర్, ఎమ్డీ అక్బర్, ఆకులపెల్లి యాకోబు, తాండ్ర ఆనందం, మైదం మల్లయ్య, పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి పుస్తకాల అందజేత



వైద్య విద్యార్థి తల్లికి పుస్తకాలను అందిస్తున్న మధు

మట్టెవాడ, ఆగస్టు 2: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వైద్యవిద్యార్థికి రూ.25వేల విలువైన పుస్తకాలను శుక్రవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో అందించారు. రంగశాయిపేటకు చెందిన దుద్ది గాయత్రి ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ మహబూబాబాద్ మెడికల్ కాలేజీలో చదువుతోంది. ఖరీదైన మెడికల్ పుస్తకాలు కొనలేని స్థితిలో విషయం తెలుసుకున్న వైశ్య ఫెడరేషన్ రూ.25వేల విలువైన బుక్కులను విద్యార్థి తల్లికి వరంగల్‌లో అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు గట్టు మహేశ్‌బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు వల్లాల శైలజ, జిల్లా సెక్రెటరీ గుమ్మడవెల్లి సురేష్, వల్లాల నాగేశ్వర్‌రావు, మంచాల కుమార్, బొమ్మినేని మనోహర్, ఎర్ర నరేశ్ పాల్గొన్నారు.

'టెక్నాలజీకి మానవత్వాన్ని జోడించాలి..'



భద్రకాళి దేవాలయం వద్ద మాట్లాడుతున్న నరేందర్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 2: ప్రకృతి వైపరీత్యాలు సమసిపోయేలా టెక్నాలజీకి మానవత్వాన్ని జోడించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్సీతో ముందుకెళ్లాలని ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ శాస్త్రవేత్త చింతం నరేందర్ అన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అనేక యూనివర్సిటీల్లో రీసెర్చ్ చేసిన వరంగల్ వాసి నరేందర్ శుక్రవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీర్వాదం అనంతరం మీడియాతో మాట్లాడుతూ వరంగల్‌కు రావడం ఎంతో సంతోషంగా ఉందని, భద్రకాళి అమ్మవారి ఆశీర్వాదాలు పొందడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే కాలమంతా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మీదనే ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ ధర్మరాజు, శ్రీనివాసరావు, విజయరాణి పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

శంభునిపేట, ఆగస్టు 2 : చీడపీడల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య అన్నారు. మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై శుక్రవారం కేవీకేలో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఫోన్ ఇన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.

అనాథ పిల్లలకు అన్నదానం

గీసుగొండ, ఆగస్టు 2: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లం బాలకిషోర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఊకల్ క్రాస్ రోడ్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీకాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరగోని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి, అల్పాహారం, భోజనం అందచేశారు. కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్, అల్లం మరెడ్డి, మాదాసి రాంబాబు, పొగాకు భిక్షపతి, దౌడు బాబు, దౌడు సునీల్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అడిషనల్ కలెక్టర్ పరామర్శ

వరంగల్ సిటీ, ఆగస్టు 2: కాశిబుగ్గకు చెందిన వంగిరి రవి తల్లి కాంతమ్మ(85) ఇటీవల మృతి చెందగా, హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాలులో జరిగిన కాంతమ్మ సంతాప సభకు హాజరై నివాళులర్పించారు. రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, ఏనుమాముల ఎస్ఐ శ్రీకాంత్, వివేకానంద యోగా సంస్థ అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 2: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 13 మంది వాహనదారులకు శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 13 మంది వాహనదారులకు రూ. 18వేలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వారికి రూ.2000 జరిమానా విధించినట్లు తెలిపారు.

పాఠశాలకు కుట్టుమిషన్ల అందజేత

సంగెం, ఆగస్టు 2: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 1956-1974 వరకు పల్లార్‌గూడకు చెందిన దేవులపల్లి సాంబశివరావు పనిచేశారు. ఆయన పేద విద్యార్థులకు తనవంతు సాయం అందించేవారు. సాంబశివరావు కుమారులు, కుమార్తెలు సైతం ఇదే పాఠశాలలో చదివి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలకు రెండు కుట్టు మిషన్‌లు, సౌండ్ సిస్టంలను అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రతియేట విలువైన వస్తువులను అందజేయాలన్న ఆలోచన రావడం అభినందనీయమని ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ అన్నారు.

'హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం'

ఖిలావరంగల్, ఆగస్టు 2: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ, ఎంఎల్-మాస్‌లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి విమర్శించారు. శుక్రవారం ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావుకు ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఎంఎల్-మాస్లైన్ జిల్లా, నగర నాయకులు మైదం పాణి, ఎస్.మోహన్, బొళ్ళ రమేష్ పాల్గొన్నారు.

అదే నిర్లక్ష్యం!

5వ పేజీ తరువాయి

ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, రూ.30కోట్లతో భద్రకాళి మాఢవీధులు, రూ.75 కోట్లతో వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, రూ.85కోట్లతో కాళోజీ కళాక్షేత్రం, ఖిలా వరంగల్, మ్యూజికల్ గార్డెన్, వడ్డెపల్లి బండ్‌లలో కొన్ని పనులను చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో జరిగిన సమీక్ష సమావేశంలో కుడాకు పెద్దపీట వేసినా పనులు ముందుకు కదలని పరిస్థితి ఉంది. ఈ మేరకు విజుబుల్ ప్యాకేజీతో భాగంగా నగరంతో పాటు విలీన గ్రామాలలో రూ.500కోట్లతో తారు, మెటల్ రోడ్లు వేసే పనుల్లో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా వరంగల్‌లో ఓ సిటీ, మడిపెల్లిలో మా సిటీ, ఉనికిచెర్లలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేశారు. ఇందులో చాలా పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేసినట్లు తెలిసింది. అంతేకాకుండా వచ్చే నిధుల నుంచి కాంట్రాక్టర్ల ద్వారా కుడాలో పనిచేసే ఓ అధికారి 10 శాతం పర్సంటేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా చేసిన పనులకు అధికారులు బిల్లులు చేయకుండా లంచాలకు ఇబ్బందులు పెట్టడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పడకేస్తున్నట్టు తెలిసింది.

అధికారుల్లో చలనం వచ్చేనా?

గ్రేటర్ వరంగల్ పరిధిలో నడుస్తున్న స్మార్ట్ సిటీ మిషన్ పనులు నిర్వర్తించే బల్దియా, కుడా అధికారులు గత ప్రభుత్వంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వల్లనే పనుల్లో జాప్యం జరిగినట్టు ప్రచారం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా శాఖల మధ్య సమన్వయం లేకపోయినట్టు నిఘా విభాగాల ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. జూన్ 30 వరకే స్మార్ట్ సిటీ మిషన్ పథకం ముగియనుంది. ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉండడం, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఇదీ గమనించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కేంద్ర గృహనిర్మాణాల పట్టణ, వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి విషయం తెలిపారు. సానుకూలంగా స్పందించి వచ్చే యేడాది 2025 మార్చి 31 వరకు స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి చేయవచ్చనే అవకాశాన్ని కల్పించారు. కాగా మరో 8 మాసాల్లో వరంగల్ నగరంలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వరంగల్ అభివృద్ధి కోసం సీఎంను మరో రూ.850కోట్లు కావాలని కోరగా, ఇప్పటికే రూ.300కోట్లు విడుదలైనట్లు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వెల్లడించారు. అయితే ఇప్పటికైనా పనులు పూర్తి చేసేందుకు వరంగల్ బల్దియా, కుడా అధికారుల్లో చలనం వచ్చేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.518కోట్లతో వరంగల్‌లో పెండింగ్ పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తి చేయకపోవడంతో కొత్త, పాత నిధులు వెనక్కి వెళ్లిపోవచ్చని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 3 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

క్రీడాకారిణి దీప్తికి పారితోషికం అందించాలి

• అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట/పర్వతగిరి, ఆగస్టు 2 : పారా అథ్లెట్ జీవంజి దీప్తికి తగిన పారితోషికం అందించి ఆదుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవారం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పర్వతగిరి మండలంలోని కల్లెడకు చెందిన జీవంజి దీప్తి పేద కుటుంబంలో పుట్టి పారా ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించిందని, పారిస్‌లో జరగనున్న పారాలింపిక్స్‌కు అర్హత సాధించిందన్నారు. దీప్తిని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకోవాలని స్పీకర్ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎంకు విన్నవించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా క్రీడల ప్రోత్సాహానికి రూ.321 కోట్లు కేటాయించంతోనే క్రీడలపట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో స్టేడియం నిర్మించాలని కోరారు.

మెడికల్ కళాశాల పేద విద్యార్థులకు వరం

• కళాశాలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఆగస్టు 2 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన వైద్య కళాశాల గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు వరంగా మారనుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి వైద్య కళాశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన వైద్య కళాశాలను, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో వరంగల్ జిల్లా నర్సంపేటకు వైద్యకళాశాలను మంజూరు చేశారన్నారు. వెంటనే కళాశాల భవన నిర్మాణాలు ప్రారంభించామన్నారు. మెడికల్ కళాశాల ప్రారంభానికి నేషన్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడం హర్షణీయమన్నారు. త్వరలో అడ్మిషన్లు ప్రారంభమై విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో స్థానికులకే ఉద్యోగ అవకశాలు కల్పించడంతో పాటు కళాశాల భవన నిర్మాణానికి భూమి అందించిన వారికి ఒక్కొక్కరికి ఉద్యోగం అందించాలని కోరారు. వరంగల్ జిల్లా కేంద్రానికి సమీపంలో వైద్య కళాశాల ఉండ డం అనుకూలమన్నారు. నర్సంపేట వైద్య కళాశాలను పీజీ కళాశాలగా ఉన్నతీకర ణ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రాంస్వామినాయక్, రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిసిపాల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి. పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు పెండ్యాల యాదగిరి. గంప రాజేషంగౌడ్, పెరుమాండ్ల రవి, ప్రభాకర్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

ప్రముఖ వ్యాపారవేత్త, పద్మశాలి సేవ సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం సతీమణీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి, ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పద్మశాల సేవ సంఘం పట్టణ అధ్యక్షుడు రుద్ర ఓం ప్రకాష్, గోనె యువరాజు. శ్రీధర్ రెడ్డి, మునిసిపాల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి. పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణగౌడ్, నాయకులు. కార్యకర్తలు ఉన్నారు.

వామ్మో.. క్షుద్ర పూజలు!

మూఢనమ్మకాల నేపథ్యంలో రోడ్లపై పూజా సామగ్రి దర్శనం

రహదారులపై ప్రయాణించడానికి భయపడుతున్న జనం

ఆధునిక యుగంలోనూ ఇవేంటని చర్చ

అవగాహన కల్పించాలంటూ అభిప్రాయాలు

దుగ్గొండి, ఆగస్టు 2 : ఆధునిక యూగంలో సాంకేతికంగా అభివృద్ధి బాటలో ప్రయాణిస్తున్నప్పటికీ పల్లెల్లో మూఢ నమ్మకాలు పెరుగుతునే ఉన్నాయి. దయ్యం, భూతం పట్టిందని, శక్తులు వాలినాయని, కుటుంబంపై మత్రాలు చేశారనే వివిధ రకాల కారణంగా గ్రామాల్లోని అమాయక ప్రజలు మూఢనమ్మకాలపై మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆర్థికంగా పలువురు నష్టపోతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని కొంత మంది ఆసరా చేసుకొని పలు రకాల మూఢ నమ్మాకాలను సృష్టించి ఆర్థికంగా బలపడుతున్నారు. తాజాగా రెండు రోజుల కిందట మండలంలోని మందపల్లి, చాపలబండ కలిసే రహదా రిపై క్షుద్ర పూజా సామగ్రి దర్శనం ఇవ్వగా, బాటసారులు భయాందోళన పడుతున్న క్రమంలో సమాచారం అందు కున్న ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి క్షుద్రపూజా సామగ్రి తొలగించారు. మూఢ నమ్మ కాలను నమ్మవద్దని బాట సారులకు తెలిపారు. అదేవిధంగా తిమ్మంపేట నారాయణ తండాలకు వెళ్లే రహదారిపై క్షుద్ర పూజా సామ గ్రి శుక్రవారం దర్శనమిచ్చింది. వివిధ గ్రామా ల్లో రహదా రులపై తరచుగా క్షుద్ర పూజా సా మగ్రి దర్శనం ఇస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. ఎన్ని రకాల ప్రచారాలు, మేజిక్‌లు, హిప్నాటిజం, నాటికలు ప్రదర్శిస్తు న్నప్పటికీ మూఢనమ్మకాలు నిర్మూలన కావడంలేదని పలువురు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.





తిమ్మంపేటలో, మందపల్లి, చాపలబండ రోడ్లపై ఆనవాళ్లు



మందపల్లి, మూడు రహదారుల దగ్గర క్షుద్రపూజ సామగ్రిని తొలగిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

మూడు రహదారులు కలిసిన చోట..

గ్రామాల్లో మూడు రహదారులు కలుస్తే చాలు తెల్లవారు జాముకల్లా రకరకాల క్షుద్ర పూజా సామగ్రి దర్శనమిస్తున్నాయి. బాట సారులు రహదారులపై ప్రయాణించడానికి భయపడే విధంగా రంగులమయ్యం చేస్తున్నారు. వాహనదారులు మూడు రహదారులు కలిసే చోటకు రాగానే భయందోళనతో వెళ్తున్నామని, గ్రామాల్లో మూఢ నమ్మకాల నిర్మూలనకై విస్తృతంగా ప్రచారాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అవన్నీ మూఢ నమ్మకాలు

నీలోజు వెంకటేశ్వర్లు, ఎస్సై, దుగ్గొండి



మంత్ర తంత్రాలు లేవు. మూఢ నమ్మకాలతో ఆర్థికంగా,మానసికంగా నష్టపోవద్దు. ఆరోగ్యం బాగా లేకపోతే డాక్టర్ల దగ్గరకు పోయి వైద్యం చేయించుకోవాలి. భూత వైద్యుల దగ్గరకు పోకుండా జాగ్రత్త పడాలి. వివిధ రకాల వేషాలతో గ్రామాలకు వచ్చే వారి మాటలు నమ్మి మోసాలకు గురి కావద్దు. పోలీసు కళా బృందాలచే విస్తృతంగా మూఢనమ్మకాల నిర్మూలనకై గ్రామాల్లో ప్రచారాలు చేస్తున్నాం. అక్షరాస్యత పెంపొంచుటకు పాటలు నాటకాల రూపకంగా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుంది. ఎవరూ కూడా మూఢ నమ్మకాలకు బలికావద్దు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలి.

అదే నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, రూ.30కోట్లతో భద్రకాళి మాఢవీధులు, రూ.75 కోట్లతో వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, రూ.85కోట్లతో కాళోజీ కళాక్షేత్రం, ఖిలా వరంగల్, మ్యూజికల్ గార్డెన్, వడ్డెపల్లి బండ్‌లలో కొన్ని పనులను చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో జరిగిన సమీక్ష సమావేశంలో కుడాకు పెద్దపీట వేసినా పనులు ముందుకు కదలని పరిస్థితిఉంది.ఈ మేరకు విజుబుల్ ప్యాకేజీతో భాగంగా నగరంతోపాటు విలీన గ్రామాలలో రూ.500కోట్లతో తారు, మెటల్ రోడ్డు వేసే పనుల్లో కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఇంకా వరంగల్‌లో ఓ సిటీ, మడిపెల్లిలో మా సిటీ, ఉనికిచెర్లలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేశారు. ఇందులో చాలా పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేసినట్టు తెలిసింది. అంతేకాకుండా వచ్చే నిధుల నుంచి కాంట్రాక్టర్ల ద్వారా కుడాలో పనిచేసే ఓ అధికారి 10శాతం పర్సంటేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.అంతేకాకుండా చేసిన పనులకు అధికారులు బిల్లులు చేయకుండా లంచాలకు ఇబ్బందులు పెట్టడంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పడకేస్తున్నట్టు తెలిసింది.

అధికారుల్లో చలనం వచ్చేనా?

గ్రేటర్ వరంగల్ పరిధిలో నడుస్తున్న స్మార్ట్ సిటీ మిషన్ పనులు నిర్వర్తించే బల్దియా, కుడా అధికారులు గత ప్రభుత్వంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వల్లనే పనుల్లో జాప్యం జరిగినట్టు ప్రచారం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా శాఖల మధ్య సమన్వయం లేకపోయినట్టు నిఘా విభాగాల ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. జూన్ 30వరకే స్మార్ట్ సిటీ మిషన్ పథకం ముగియనుంది. ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉండడం, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఇదీ గమనించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కేంద్ర గృహ నిర్మాణాల పట్టణ, వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి విషయం తెలిపారు. సానుకూలంగా స్పందించి వచ్చే యేడాది 2025 మార్చి 31వరకు స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి చేయవచ్చనే అవకాశాన్ని కల్పించారు. కాగా మరో 8 మాసాల్లో వరంగల్ నగరంలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వరంగల్ అభివృద్ధి కోసం సీఎంను మరో రూ.850కోట్లు కావాలని కోరగా, ఇప్పటికే రూ.300కోట్లు విడుదలైనట్టు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వెల్లడించారు. అయితే ఇప్పటికైనా పనులు పూర్తి చేసేందుకు వరంగల్ బల్దియా, కుడా అధికారుల్లో చలనం వచ్చేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.518కోట్లతో వరంగల్‌లో పెండింగ్ పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తి చేయకపోవడంతో కొత్త, పాత నిధులు వెనక్కి వెళ్లిపోవచ్చని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

మాధన్నపేట పెద్ద చెరువు సాగునీటి విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న దృశ్యం

నర్సంపేట టౌన్, ఆగస్టు 2 : రైతులు వరినాట్లు వేసుకునేందుకు వీలుగా శుక్రవారం నీటి పారుదల శాఖ ఏఈ నితిన్ ఆధ్వర్యంలో నర్సంపేట మండలం మాధన్నపేట పెద్ద చెరువు తూమును తెరిచి సాగునీటిని విడుదల చేశారు. మాధన్నపేట చెరువులో నీటి సామర్థ్యం 17 అడుగులకు గాను 16 అడుగుల నీటి మట్టం చేరుకోవడంతో వరి నాట్ల కోసం పెద్ద చెరువు తూమును తెరిచి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చిలువేరు కుమారస్వామి, బన్న రాజయ్య, రాజహంస, నీటి పారుదల శాఖ సిబ్బంది కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూమిని చూపుతున్న గ్రామస్థులు

చెన్నారావుపేట, ఆగస్టు 2 : మండలంలోని ఉప్పరపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 115, 116. 117లో కొన్ని సంవత్సరాలుగా శ్మశాన వాటిక స్థలంగా వాడుకుంటున్నారన్నారు. రెండు ఎకరాల స్థలం ఉన్న భూమి ప్రస్తుతం రోడ్డు వెడల్పులో కొద్దిగా పోగా చుట్టు పక్కల వారు ఎకరంపైగా ఆక్రమించుకున్నారన్నారు. భూమిని సర్వే చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిలుపాక అనిత, మొగిలి, కుల అధ్యక్షుడు చిలకపాక స్వామి, నవీన్, బాలు, కొమ్మాలు, మేకల భిక్షపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులందరికీ పట్టాలు అందించాలి

చెన్నారావుపేట, ఆగస్టు 2 : గుడిసె వాసులందరికీ పట్టాలను అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారు పనికర గ్రామ సమీపంలో ఉన్న సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వెసుకున్న స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడెసెలు వెసుకున్న వారందరికీ ప్రభుత్వం పట్టాలను అందించాలన్నారు. కొంతమంది వ్యక్తులు తమదే భూమియని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు. సీపీఐ నాయకులు బండి యాకుబ్, సింగం వెంకటలక్ష్మీ, ఘైదం యాకయ్య, రేణుక, చెక్క సరిత, శ్రీను, సరోజన, దూలం రజిత పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖానాపురం, ఆగస్టు 2 : ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి అన్నారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతిలకు వేరువేరుగా అందజేశారు. ఈ సందర్భంగా పైడి మాట్లాడుతూ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి సీజనల్ వ్యాధులను అరికట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, పెంచిన పింఛన్‌లను అమలు చేయాలన్నారు. బీసీ, ఎస్సీ. ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు అందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతుకూలి సంఘం డివిజన్ కార్యదర్శి ఈరెల్లి రాంచందర్, కుమార్, భిక్షం, జనగాం దేవస్వామి, బోనగిరి సారయ్య, రాంమూర్తి, సీతారం పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి

ఖానాపురం, ఆగష్టు 2: పశుపోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ బీఎస్.రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో మహిళా శక్తి ప్రోగ్రాంలో భాగంగా పాడిపశువుల పెంపకం దారులకు పశు పోషణలో పాటించాల్సిన మెళకువలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణలో సరైన సంరక్షణ చర్యలు తీసుకుంటే రైతులకు అధిక లాభం కలుగుతుందన్నారు. పాడి పరిశ్రమ నిర్వాహణలో భాగంగా పశువులకు అందించే మేతలో 70శాతం పచ్చిగడ్డి, 30శాతం ఎండుగడ్డి పెడితే పాల దిగుబడి అధికంగా వస్తుందన్నారు. అదేవిధంగా మేలు జాతి గేదెలైన ముర్రా, గ్రేడ్ ముర్రా జాతుల గేదెలు అధిక పాల దిగుబడి నిస్తాయన్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేయిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పశువైద్యుల సూచనలు పాటించి పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం సరిత, మండల పశువైద్యాధికారి శ్రీలక్ష్మీ, ఏపీఎం సుధాకర్, సీసీలు నూరున్నీసా, కరుణ, నర్సయ్య పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిగా సోమశేఖర్



దుగ్గొండి, ఆగస్టు 2 : మండల కేంద్రంలోని పశు వైద్యా ధికారిగా సోమశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన పశు వైద్యాధికారి రాంమోహన్ బదిలీపై నెక్కొండ మండలంలోని అలంకానిపేటకు వెళ్లగా, రాయపర్తి మండలంలోని పరికవేడు నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు గురువారం స్వీకరించారు. మండలంలోని తిమ్మంపేట పశువైద్యాధికారి బాలాజీ, తొగర్రాయి పశువైద్యాధికారి శారద, సిబ్బందిలు స్వాగతం పలికారు.

బీజేపీలో చేరికలు

నర్సంపేట టౌన్, ఆగస్టు 2 : మండలంలోని బోజ్యానాయక్ తండాలో బీజేపీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు శుక్రవారం బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాణాప్రతాప్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంభంపాటి పుల్లారావు, రేసు శ్రీనివాస్, బట్టు మదన్, ఆముదాల రమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోతులు



బీసీ కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

నెక్కొండ, ఆగస్టు 2 : నెక్కొండలోని బీసీ కాలనీ నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు ఉన్న 15ఫీట్ల రోడ్డుపై అడ్డంగా కాలువ ఏర్పాటుచేసి కాలనీ వాసుల రాకపోకలను అడ్డుకుంటున్న నెక్కొండకు చెందిన రావుల లక్ష్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కాలనీ వాసులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 35 సంవత్సరాల క్రితం ఈ కాలనీ ఏర్పడగా, అప్పటి నుంచి రాకపోకలను సాగిస్తున్నామని చెప్పారు. అయితే ఈ స్థలం తనదంటూ లక్ష్మారెడ్డి కాలనీ వాసులు రాకపోకలు సాగకుండా కాలువ తవ్వించాడంటూ వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై కార్యదర్శి సదానందంకు వినతి పత్రాన్ని అందించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.

వ్యవసాయ కూలీలకు పొలాల వద్దే వైద్య సేవలు

నెక్కొండ, ఆగస్టు 2 : నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామ శివారు వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు, కూలీలకు శుక్రవారం నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ సుమన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు గాను వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినప్పటికీ వ్యవసాయ పనుల కారణంగా ప్రజలు ఇండ్ల వద్ద ఉండడంలేదన్నారు. వారు ఉన్న చోటనే వైద్య సేవలను అందించడానికి వ్యవసాయ క్షేత్రాలవద్దకు వెళ్తున్నామన్నారు. వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగారంలో డాక్టర్ అర్చన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 116 మంది రోగులకు పరీక్షలను జరిపి మందులను పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అన్యాయం'



ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ అభివాదం చేస్తున్న నాయకులు

రాయపర్తి, ఆగస్టు 2 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మాలలను అన్యాయం చేసినట్టే అవుతుందని మాల మహానాడు మండల అధ్యక్షుడు ఉబ్బని సింహాద్రి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని గతంలో చెప్పిన కోర్టులే మళ్లీ మోదీ ప్రభుత్వం వలన మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టేలా చేశాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కమటం వీరస్వామి, మధు, నవీన్, మల్లేష్, రాజు, ఎల్లయ్య, ఉప్పలయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం

నల్లబెల్లి, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకమని మేడపల్లి అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని మేడపల్లి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచాను పేల్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మంద నరేష్, మామిడపల్లి రాజు, మంద చింటు, గాడిపెల్లి రాజ్‌కుమార్, మంద రాజు, అర్రం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట రూరల్: మండలంలోని కడారిగూడెంలో సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని హర్షిస్తూ శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 30 ఏండ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసిన మంద కృష్ణ కలనెరవేరిందని, మాదిగలకు విముక్తి కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పింగిళి నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, భాస్కర్ రావు, సిలువేరు రాజు, రంజిత్, వెంకటేష్, మల్లెపాక చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పీహెచ్‌సీ వైద్యాధికారి

రాయపర్తి, ఆగస్టు 2 : రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ వనజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా పీహెచ్‌సీకి వైద్యాధికారి లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో సేవలు అందాయి. ఇప్పుడు పీహెచ్‌సీ పరిధిలో పూర్తిసేవలు అందుబాటులోకి రానున్నాయి. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వనజకు సిబ్బంది స్వాగతం పలికారు.

గ్రీన్ ఫీల్డ్ బాధిత రైతుల ముందస్తు అరెస్టులు

పర్వతగిరి, ఆగస్టు 2 : గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతులు చలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో పోలీసులు వారిని శుక్రవారం ముందస్తుగా అరెస్టుచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్తుండడంతో దానికి భూములివ్వడానికి నిరాకరించిన పలువురు రైతులను అదుపులోకి తీసుకుని సాయంత్రం వదిలేశారు. కార్యక్రమంలో రైతులు నల్లపు దేవేందర్, ధంశెట్టి నర్సింగం, బోయినపెల్లి యుగేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

దుగ్గొండి, ఆగస్టు 2 :మండలంలోని గిర్నిబావి వైన్స్‌షాపు సమీపంలో శుక్రవారం బైక్ ఆటో ఢీకొనగా ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మర్రిపల్లికి చెందిన కొత్తపెల్లి రమేశ్ బైక్‌పై వరంగల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా వెనుకనుంచి వేగంగా ఆటోవచ్చి అదుపుతప్పి బైక్‌ను ఢీకొటింది. బైక్‌పై వస్తున్న రమేశ్ తలకుగాయం కాగా, చికిత్సకోసం వరంగల్‌కు తరలించారు.

మరో రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

చెన్నారావుపేట, ఆగస్టు 2: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కోనాపురంగ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రెడ్డబోయిన విజయ్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలోనే కోనాపురం గ్రామ శివారులో మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడడంతో అతని తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో చికిత్స కోసం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా మేరుగు రమేష్

రాయపర్తి, ఆగస్టు 2 : మండలంలోని తిర్మలాయపెల్లి గ్రామంలో గౌడసంఘం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మేరుగు రమేష్, ఉపాధ్యక్షుడిగా మండల మధుకర్, కార్యదర్శిగా ముత్యాల తిరుపతయ్య, డైరెక్టర్లుగా సుదగాని గోపాల్, రయాకయ్య, బొమ్మెర కొమురయ్య, బండి కొమురయ్య, రేసు మల్లయ్య, తాళ్లపెల్లి నవీన్, చిన్న కుమారస్వామి లను ఎన్నుకున్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

నెక్కొండ ఆగస్టు 2 : అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.1.50లక్షల గంజాయిని పట్టుకున్నట్లు నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రకు చెందిన పుష్కర హరిదాస్ అనే వ్యక్తి 6 కిలోల ఎండు గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తునికి చెందిన సమీర్ సుమన్ అనే వ్యక్తి వద్ద నుంచి నిందితుడు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం జాతీయ రహదారిపై ధర్నా



ధర్నా చేస్తున్న దుబ్బతండా గిరిజనులు

వర్ధన్నపేట, ఆగస్టు 2: వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బతండావాసులు తండాకు రోడ్డు వేయాలని పాలకులను కోరుతున్నా మంజూరయ్యాయి అని అంటున్నారే తప్ప ఆచరణలో లేదని శుక్రవారం వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించడంతో ఇరువైపులా వాహనాలు నిలిచి పోయాయి. వర్ధన్నపేట సెకండ్ ఎస్సై రాజు సంఘటన స్థలానికి వెళ్లి వారికి నచ్చచెప్పడంతో పాటు, దీనికి తోడు వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయని అవి త్వరలోనే ప్రారంభిస్తారని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.